

కథ 1997

2

# గొడ్డ దొంగ

కొలకలూరి ఇనాక్

అలికిడైతే 'ఎవఁడ్రాడు' అంటన్నాడు నాగడు. గాలికి సెట్టల్లాడి పైకి లేత్తన్నాడు. సీమ సిటుక్కుమంటే సాలు బయటికొత్తన్నాడు. సుట్టూ సూత్తన్నాడు. ఆడికంటికి కునుకు లేదు. కంటో వొత్తులేసుక్కూసున్నాడు.

సత్తే పొడుకోడు. ఇంటో కిరసనాల బుడ్డి. గుడ్డెలుతురు. సుట్టూ సీకటి. కన్ను బొడుసుకున్నా కానరాదు.

పొద్దుగుంకి మూడు జావులయింది. ఊరు సద్దుమణిగి రొండు జావులు దాటుద్ది. తెల్లారటానికి జావ్ పొద్దుంది. నాగడు నిద్దరబోతే ఒట్టు. కాటికాప రోడికి మల్లే బాచి పట్టేసుక్కూసున్నాడు.

అదాడిల్లే. ఒంటినిట్టాడిల్లు. దెయ్యాల్దిరిగే సోటు. పిలిత్తే పలికే నా కొడుకుండడు. సావదెంగి సెవులు మూసినా దిక్కూ మొక్కూ వుండదు.

ఆడసలే రాకాసోడు. ఆడి జోలికెవుడూ బోడు. వచ్చేడా, సచ్చేడే. అడి మాటెవుడెత్తడు. ఆణ్ణోరెత్తేడా అమ్మ నా బూతులే. కంపునోరు. ఆణ్ణోట్టో ఎవుడూ నోరు బెట్టడు. కంపు. ఆడంటే మాటలా, అమ్మకు మొగుడు.

ఇంటోంచి పొడుసుకొచ్చేడు నాగడు. సేను గనిమలెక్కేడు. పిల్లకాలవ మీద పంగజాపి అడుగేసేడు. కాలవ గట్టెక్కాడు.

ఎక్కి సుట్టూ బారజూసేడు. కంటికేవీ గనపళ్లా. అటెవుడూ రాలా, పోలా. కాలవగట్టు మీద బళ్ల బాటలో కుంచేపు కూసున్నాడు. కాలవ గట్టునానుకుని మఁర్రి సెట్టు. సెట్టుకింద సప్తా. పక్కన గట్టుగొయ్య. గడ్డిమేత మీద కుఁర్ర.

తెల్లరితే దాన్ని గొయ్యాల, పోగులెయ్యాల, అమ్మాల. అదీ ఆడిపని. బతుకుదెరువు. రోజిడిసి రోజు కొయ్యదూణ్ణి గోత్తాడు. ఆడి పొట్ట గడవాల. దున్న కుఁర్రంటే గిరాకీ. దాని పొట్ట గోత్తే ఈడి పొట్ట నిండుద్ది.

ఆడు మిడిగుడ్లోడు. ఎఁర్రగుడ్లు. పోతురాజు గుడ్లకు మల్లే ఉంటై. పొగులు జూత్తే రేత్తిరి కల్లోకొత్తాడు. ఆణ్ణి పిల్లా జల్లా జూత్తే జొరవొచ్చి మంచవెక్కాల్సిందే! ఆడి దెబ్బంటే గోలుకొండబ్బా అనాల. అట్టాటోడు. ఆడెంతెత్తు? అంతెత్తు! సెయ్యెత్తు మనిషి.

ఆడప్పుడు పల్లెలోనే ఉండేవోడు. సెప్పులు గుట్టి పొట్ట బోసుకునేవోడు. కిఁర్రుసెప్పులు గావాలంటే ఆడికాడికే సచ్చినట్టు రావాల. ఆడి పంతనవే పంతనవ్.

మెట్ట పొలాలోళ్లు మోట గుట్టిచ్చాలంటే ఈడే డుండాడావటాని యెతుక్కుంటా రావాల్సిందే ఎంత టోడయినా. సిటికలో సిటికంటే సిటికలో మోట గుట్టేవోడీడు.

డబ్బున్న నాయాళ్లు తాతాలు బిల్లాలు బాటాలు బోటాలు బెట్టుకుని సెప్పులు గుట్టి అమ్ముకుంటుంటే బతుక్కొండ్రా నా కొడుకుల్లారా అని పంతిత్తి పఁనాయితో పాటు అటకెక్కించేడు. ఆటికెప్పుడోగాని పఁనాదు.

దున్నకుఁర్ర కాళ్లు గట్టి మెడిరగదీసి, గొంతు గోత్తంటే సూసిన సిన్నోడు ఉచ్చబోసుకుని, జొరం దగిలి, మంచం బట్టి, కలవరిచ్చి కలవరిచ్చి, మంచం దిక్కుండానే వొలుకుల్లోకి బొందల్లోకి సేరిపోతే, ఆడెమ్మ, నాగణ్ణననరాని మాటలని, అమ్మోరింటికి బొయ్యి, మల్లి టుదిరిగి సూత్తే, మింటి సుక్కలు మంటిలో బడ్డట్టే. రాలా ఈడూ బోలా. పిలుసుకు రాలా.

అంతే, అదీణ్ణొదిలేసిందో, ఈడు దాన్నొదిలేసేడో గాని, అది ముండా మొయ్‌లా, ఈడి మొల్‌తాడూ దెంచలా, ఈ ముండమోపోడికి మల్లీ పెల్లీలే, పెటాకుల్లే.

ఈడు గొడ్డుగోసేటప్పుడు పిల్లోళ్లు దడుసుకుంటన్నారావటానంటే, ఆళ్ల మీదా, ఆళ్ల పిల్లోళ్ల మీదా, పల్లోళ్ల మీదా, ఆడికిది బుట్టి, యెట్టయితే అట్టాగే కాన్ తెమ్మని సేలో ఇల్లేసుకుని బతుకు ఎల్లమారుత్తాన్నాడాడు.

ఆడ ఆడిదొక్కడిదే యిల్లు. సుట్టూ కొంపాలే గోడూలే. అల్లంత దూరంలో పల్లె. తెల్లారితే పల్లే యిల్లు. రేత్రే వల్లకాడు. సావు పిలిసినా పల్లె పలకదు. ఉలకదు. వినబడదు. కనబడదు. పొగులంత దగ్గిరా, రేత్రంత దూరవ్.

ఆడు బళ్లబాట మీంచి లేవలా. కుందుగూసున్నోడు, అట్టాగే సచ్చుబడ్డావోడికి మల్లె ముడుసుక్కూసున్నాడు.

తెల్లోళ్లని ఎల్లగొట్టాలని తెనాలి రైల్‌టేసున్ని తగలబెట్టినప్పుడీడు గొడ్లకాడ బుడ్డోడు. ఈడాడికి యెట్టాబోయేడో యేందోగాని, కిరసనాల డబ్బా మోసేడు. తీగల్దెంచేడు.

పోలీసోళ్లు తుపాకుల్దెచ్చేరు, కాలుత్తారన్నప్పుడు, ఈడొక్క దూకుతో కటేరం మీదగా లగెత్తి, పొలాల కడ్డంబడి మురుక్కాలవలో ఈది పల్లెలో బడ్డాడు. ఊరికీ పల్లెకి అంతదూర వుండటం అంగలకుదిటికే సెల్లింది.

ఆ మొయ్‌న ఆడికైదు పొగళ్లూ ఐదు రేత్రుళ్లు ఒకటే జొరం. మూసినకన్ను దెరవలా. తిండిలే తిప్పల్లే. 'అద్దెమద్దెపు నా కొడకా నువ్వెందుకాడికి బోయేవురా,' అని అయ్య తిట్టినా తెల్దు. తిమ్మినా తెల్దు. ఇవరం తవరం తెలీన్నాకొడుకీణ్ణెందుకాడికి బోనిచ్చేదే నీయమ్మ ఆవటాని ఆళ్లమ్మందిట్టినా తన్నినా, ఈడికేందీ తెల్దు.

ఆరోజుల్లో గూడుసోగెనల్లోంచి దెంకొచ్చిన దుప్పట్లు సినిగినియ్ సినిగిపోగా, ఇంకా రొండోని దగ్గిర మిగిలుండాయి. ఎర్రంచు నల్ల దుప్పట్లు, ఉన్నివంటే ఉన్నివే ఎచ్చగుండేయి. సలిగాదు, దానెమ్మయినా బయంలేదు. సిరుగుపట్టవు, ఒక పట్టాన పోవు.

ఈడసలే అమాసెనాడు బుట్టినోడు. అమాసెకు మల్లేనే ఉంటాడు. ఆడుకొక దుప్పటా, అదీ నల్లటిదా, ఇంకేం సీకట్లో సీకటికి మల్లె ముడుసుక్కూసున్నాడీడు.

మూణ్ణాళ్లు ముసురుబట్టి నిన్నే తెరిపిచ్చింది గానీ సలి దగ్గల. ఈగవ తడారలా, ఇంకా కాలవగట్టు బురద బురదగానే వుంది. రేగడి బురద.

సచ్చినెద్దు మొండం కదిలినట్టయితే గుడ్లు మిటకరిచ్చి చూసేడు నాగడు. ఈడు కదల్లా. పల్లికాయలకు మల్లె గుడ్లిచ్చుకొని తేరపార జూసేడు. మొండెం కదిలినట్టే అనిపిచ్చింది. ఈడేం మాట్టాళ్లా.

దొంగనాకొడుకొచ్చినంటుండాడు. అట్టా, అనుకొన్నాడీడు. కదల్లా, అలికిళ్లే.

ముసురుకు ముసిలెద్దు జత్తే బండిగట్టి తోలుకొచ్చి కాలవగట్టు మీద, మర్రిసెట్టు కిందా సప్టా పక్కన తోడిసిపోయేడు రైతు.

పొద్దుబోయిందిగానీ, లేపోతే మొండెం తోలాలిసి, సలపతీసి దణ్ణెం కాలవలోకి తోసేసేటోడే నాగడు. ముసలెద్దు వొంట్లో గుప్పెడు మాంసం లేదు. అంతా తోలు ఎమికలు పొట్ట. తోల్దప్ప ఇంకేవీ పనికిరాదు.

సచ్చిన గొడ్డు రైతుకు దొడ్డోంచి పోవాల. నాగడికి తోలుగావాల. కాలవ దణ్ణెం మింగాల.

సచ్చిన ముసిలెద్దు మొండెం మోసుకొచ్చిన పొట్లగిత్తలు ఏవనుకొంటయ్యో ఎపుడుకన్నా తెలుసుద్దా?

బతుకంతా బతికి నూకల్జెల్లిన దావటెద్దు మొండెం సూసి బతుకంతా ముందుందనుకొనే కుర్రదూడ పొద్దునే సావక తప్పదనీ, పేదోళ్ల తిండిగాక తప్పదనీ, అనుకొంటే ఎట్టుంటదో ఎవుడుకన్నా అంతుబట్టుద్దా?

సచ్చిన గొడ్డు గోసి, తోలూ, బాగుంటే మాసవూ తీసుకొని దణ్ణెం, పొట్ట, పేగులు, పేడా, పాడూ, పరదేసు కాలవలో బారేత్తే అన్నీ కొట్టుకపోతయ్యి. రాయి గట్టేత్తే కాలవలో తేలకుండా పోతై, ఎండాకాలవ్ కాలవలో పడ్డ అంక సెండాలవంతా, నీళ్లొదిలినప్పుడుకొట్టుకుపోద్ది. అప్పుడొకళ్లూ, ఇప్పుడొకళ్లూ వొచ్చి ఈ దరిద్దరవంతా కాలవలో దిమ్మరొచ్చొద్దురా అంటే ఇంటానికీడేవన్నా అల్లాటప్పా నా కొడుకా, ఇనడు. ఈడి పనీడిదే. ఆళ్ల మాటలాళ్లయ్యే.

మూడు జావులు మేల్కొన్న ఆడి మెలకవకి మేలు జరిగినట్టుగా ఎద్దు మొండెం పక్కనున్నట్టుండి కుంచం కదలిక, రవ్వంత అలికిడి. ఈడు గుడ్లు మిటకరిచ్చి సూసేడు. నిగిడిచ్చి సూసేడు. అనువానమను వానవే.

ఈ మద్దెన గొడ్ల దొంగతనాలెక్కువయ్యేయి. గొడ్డు దోలుకుపోవటమెక్కువయింది. ఎవుడు జేత్తన్నాడో, ఎట్టా జేత్తన్నాడో ఎవుడికీ అంతుబట్టలా. దొడ్డుల్లో గొడ్డుబోతున్నై. సావిళ్ల గొడ్డు బోతన్నై. పోయిన గొడ్డేవయి పోతన్నాయో తెల్దు. ఎంతెతికినా అయిపు లేకుండా పోతన్నై. అజాపజా లేకుండా అవుతున్నై. పత్తా వుంటే వొట్టు.

దొంగ గొడ్డు గోసి, అమ్మేసి. అటి అయిపు లేకుండా సేత్తన్నారని జనవ్ గుబ్బట్టాడేరు. సెవులు గొరుక్కున్నారు.

అనువానవ్ నాగడి మీదకొచ్చి పడింది. ఆడు కోసిన గొడ్డు తల్లూ, తోళ్లూ, కాళ్లూ, గిట్టలూ తడివి తడివి సూసేవోళ్లు. నాగడు రావ రావ అంటే ఇనేవోళ్లుగారు. గొడ్డుగొన్న సోటు, అమ్మినోడు, కాయిదా బేరగాడు, మారు బేరగాడు అన్నీ ఆరాదీసేవోళ్లు. అందరూ ఆడి కండగా ఉండబట్టి సరిపోయిందిగానీ లేకపోతే తిప్ప ల్తప్పేయి కావు. అంతా సావే!

ఆడికొచ్చిన ఢోకా లేదుగానీ, అనువానవే అవ దానవై బిడ్డ. ఆకల్లే. అల్లాడిపోయేడు.

లేనోడందరికీ అలుసే. అణ్ణందరూ దొంగ దొంగగా దొంగనాకొడుకుంజూసినట్టు జూత్తంటే ఏడు పొచ్చి సిర్రెత్తుకొచ్చి తెల్లోళ్లని తరవటానికి తెనాలి రైలు టేషను గాలిసినట్టు ఈళ్లని తరవటానికేం గాలసాలాని దిక్కుల్జూసేవోడు నాగడు.

పేదోడి కోపం పెదిమికి చేటు. మాటంటే తప్పు. పెదిమి గొరుక్కుంటే ముప్పు. మాట్టాడితే సిక్కు. నోరు మూస్తే తంటా, తెరిస్తే తంటా, ఆసావు సచ్చినోడికి తెలుసుద్దిగానీ సెప్తే తెల్దు. సస్తే తెల్దు.

మొన్నటికి మొన్న పొద్దున్నే గోద్దావని తోలుకొచ్చి కట్టేసుకున్న కుర్రదూణ్ణి, ఒక రేత్తిరేల గొడ్డ దొంగొచ్చి మెడ పొలుపుతో తోలుకుపోతే తానేడిసిన ఏడుపు వోదా రిసినోడే లేడు. అప్పణ్ణుంచి నాగడి మీద అనువానవ్ తగ్గితే తగ్గిందేవోగానీ సుప్తాగా పోలే.

ఆ గొడ్డదొంగకి పేదోళ్ల గొడ్డే గావాల. పేదోడి పెళ్లం వాడకట్టుకు మరదలన్నట్టు బీదోళ్ల గొడ్డే ఆడు దోలుకుపోతన్నాడు.

పేదళ్ల గొడ్డుబోతే పోలీసోళ్లు గూడా బట్టిచ్చుకోరు. అడిగేవోడూ లేడు, సెప్పేవోడూ లేడు.

దొంగ గొడ్డు కబేళాకి బోతన్నయ్యని అనువానవే గానీ రుజువేందుంది? ఆడికి పోయేవోడూ లేడు, సూసే వోడూ లేడు. సూసినా సెప్పేవోడూ లేడు. ఇనేవోడూ లేడు. దొంగ దొరకడు. అసల్దొంగే లేడు.

దొంగెవుడో, ఏ వూరోడో, యెట్టుంటాడో, ఏందీ తెల్దు.

నాగడి కొయ్య బొయ్యే. దూడబోతే పొనియ్యి బండెద్దు, దుక్కిటెద్దుబోతే ఏంగావాల? రైతు బతు కేంది? కాళ్లూ సేతులాడవు. ఆ సావు సావుగాదు.

నాగడి అనువానవే నిజవమయింది. మొండెం కాణ్ణుంచి ఆకారం గొర్రె పొట్టేలుకు మల్లే పోతురాజు బలి మేకకిమల్లే లేత కుర్రదున్నకి మల్లే నాలుక్కాళ్ల మీదుండటం, వానపాం పాకినట్టు పాకటం నాగడు సూణ్ణే సూసేడు.

ఆకారం దూడ దగ్గరికొచ్చింది. కట్టుగొయ్య తాడి ప్పింది. తాడు సేతబట్టుకోంగానే నాగడు ఎనక పాట్నొచ్చి, ఎనకాలగా వాటేసుకుంటే కింద బడి మీద బడి, పొర్లి, దొర్లి నిలబడ్డారు.

ఆచ్చెర్రం, దొంగ కూడా మణిసే!

కట్టుగొయ్యతాడు ఆడి సేతులకేసి కట్టేడు నాగడు. పొలుపు కొనదూడ మెళ్లో వుంది. కొయ్యకొన దొంగ సేతుల కట్టయింది. ఆడు లగెత్తాలంటే దూడా పరిగెత్తాల. సుతి గుదర్లా. ఆడు పోబోయి పడ్డాడు. నాగడు కప్పుకొన్న దుప్పటి ఆడికాళ్ల గట్టేడు.

ఆడిక్కాళ్లూ సేతుల్లేవ్వుగానీ, నోరూ వాయీ లేనోడుగాడే. కానదేందో ఆడరవటల్లా.

ముకంలో ముకంబెట్టి సూసినా సీకట్లో ఆడెవుడో తెలీలా.

నాగడాణ్ణి కొట్టలే, ''నువ్వెవుడివిరా? నా దూణ్ణెందుకిప్పా?''

''వొరే నాగ్గా,'' గొడ్డ దొంగ మండిపడ్డాడు.

నాగడు గురుతుబట్టాడు.

''నువ్వా దొరా? యేందీ పని?'' మెత్తబడ్డాడాడు.

''వదల్రా నా కొడక. కట్టిప్పు! నరుకుతా నా కొడక ఇప్పరా నీయమ్మ!''

''దొరా దూడ నీయబ్బ సొత్తా?''

''నీయమ్మ మొగుడి సొత్తు. ఇప్పర్నాకొడక కట్టిప్పు!''

నాగడికి వొళ్లంతా సీదర. అరికాలి బురద నెత్తి కెక్కుతావుంది. 'థూ' ఆగలా. 'నీకిద్దగదు'. ఊరుకోలా. ''పురుగులుబడి బోతావు'' పైపైకొచ్చి ''పేదోడి కడుపు గొడతావా? నీకరుగుద్దా? నువ్వెట్టా తుతెల్లుతా?'' తుపు క్కున ఊశాడు.

''కట్టిప్పరా మాదిగ లంజాకొడక?''

కులం పేరుతో తిట్టినేతలికి 'నీయమ్మ' అను కున్నాడాడు. 'మాటామరేదా జాగరత' రుసరుసలాడేడు. ''నాదూణ్ణి దెంగటానికొచ్చి నన్నే మాటంటే పణ్ణు.''

''యేం జేత్తావోయ్.''

''వోయ్ గీయ్ అనొద్దురా!''

''నువ్వెంత? నీ బతుకెంత? నువ్వేం జేత్తావురా నాగ్గా?''

''నలుగురు పెద్ద మణుసుల ముందు నీ బయిజు గడుగుతా.''

''వోర్నా కొడకా, నిన్ను నాలుగు దన్ని, నలుగురూ నాలుగు మాటలని, నన్నొదిలి, నిన్ను దొంగోడని, ఈ దూడ్డబ్బు నాకిప్పిత్తారు. నువ్వేం చేసుకోలేవు. ఆ

నలుగురూ మావోళ్లురా నువ్వొక్కడివి. వొరే లచ్మీడికే, రచ్చెందుకురా! కట్టిప్పు నీ దూడన్నీకిత్తా"

నాగడాలోసెనలో బడ్డాడు. నిజవే. ఉన్నోడి నేయం ఏరు, లేనోడి నేయం ఏరు. ఉన్నోడి మాట ఉన్నోళ్లింటారు. లేనోళ్లూ ఇంటారు. లేనోడి మాట లేనోళ్లు ఇన్రు. ఉన్నోళ్లూ ఇన్రు. లేనోడు ఏకాకి. గొడ్డ దొంగని పడ్డ పేరు పడనే పడ్డది. గాయంలేని మచ్చ. ఆ మచ్చబోదు. ఈ మచ్చ తిరగబడితే గాయం కాయం. ఇరుసులో కందెనికిమల్లే వుంది యవ్వారం.

"కట్టిప్పి వొదల్రా నాకొడక."

నాగడు వదిలిపెట్టడు. వొదలకపోతే యేం జేత్తాడు? పెద్ద మణుసులకి సెప్పాలి. సెబితే ఆళ్లు నేయం సెప్పరు.

వదిలేత్తే పోతాడు. ఊరికే పోతాడా? ఊరికే ఉంటాడా? నమ్మకం ఉండదు. ఏంజేత్తాడు? కొడుతాడు. సావగొడుతాడు.

"వొదలకపోతే యేం జేత్తాదొరా?"

"సంపుతా?"

వదలందే యెట్టా సంపుతాడో నాగ్గాడి కంతు బట్టలా.

ఇంకా జాంగడిత్తేగాని తెల్లారదు.

నాగడి నుదుటి మీద రేపుటి పొద్దు పొడిచేసింది.

సెయ్యాలిసిన పని శానా వుందని తెలిసొచ్చింది.

గొడ్డ దొంగ ఏవంటన్నా నాగడినిపిచ్చుకోటల్లే తన పని తాం జేసుకుపోతన్నాడు.

సచ్చిన ముసిలెద్దు మొండెం ఎల్లకిలగా విప్పి, ఎదురొమ్ముల్దగ్గిర్నుంచి ముడ్డిదాకా కడుపు మీద కత్తితో గీత గీత్తే పొట్టా పేగులూ బయటబడ్డయ్యి. ఆటిని కోసి, తీసి, బక్కింగమ్మ కెనాల్లోకీడిత్తే కాలవ నెలల మణిసికి మల్లె బరువుగా బోతా వుంది.

ఎగిరి గుండెల మీద దన్నినట్లు గట్టుల్ని దంతా వుంది కాలవ. పిక్కట బీర్లుగా నిండా బోతా వుందది. ఎంత కుళ్లయినా కడుపులో పెట్టుకుంటది కాలవ.

ఎద్దు మొండెం పక్కటెముకల్ని ఇరగ దొక్కితే దాని కడుపులో సాపేసుకుని పక్కేసుకునేంత కాళీ వచ్చింది.

అలివిగాని గొడ్డును కొయ్యబోయే ముందు బాదే బడితె దెచ్చేడు నాగడు.

గొడ్డుదొంగ అమ్మనాబూతులు దిడతన్నాడు. బెదిరత్తన్నాడు. ధాంధూం జేత్తన్నాడు.

నాగడు నల్ల దుప్పటి ఎర్రంచు జించి గొడ్డదొంగ నోట్లో కుక్కేడు. ఆడిక మాట్టాడితే వొట్టు. కూసేపుటికి కదలిక కూడా గప్పుచిప్పు.

నాగడు సచ్చిన ముసిలెద్దు కడుపు ఆరే, వారూ, తెచ్చి కుట్టేసేడు.

*

వానాకాలవ్ బోయి, సలికాలవ్‌బోయి, కాలవలో నీళ్లింకిపోయి, ఎండాకాలవోల్లే లాకుల దగ్గిర ఎద్దు దణ్ణెం బురదలో బయటబడింది.

ఎద్దీనిందంటే దూడను గాటగ్గట్టవన్నట్లు మణిసి నీనే యెద్దు దణ్డేం లాకులికి బట్టిందని జనం ఇరగబడి సూత్తంటే నాగడెల్లి సూసేడు.

ఎద్దు దణ్డెంలో మణిసి అస్థిపంజరం, మణిసి పుర్రెలో ఎర్రంచు దుప్పటి ముక్క.

నాట్నుంచి నేటి దాంకా గొడ్డ దొంగే అయిపులేడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 16 మార్చి 1997*

